క్లుప్తంగా

బాలా త్రిపుర సుందరి అమ్మవారికి వెండి సమర్పణ



అమ్మవారికి వెండి సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక మెంటేవారి తోటలో ఉన్న శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి మకర పీఠానికి శనివారం దాతలు 530 గ్రాముల వెండి విరాళంగా అందించారు. పట్టణానికి చెందిన వలవల సూర్య నారాయణ, మహాలక్ష్మి దంపతులు 230 గ్రాముల వెండిని ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి దాతలకు ఆశీర్వచనాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ దంతులూరి జగన్నాథరాజు సత్రం అనుబంధ సంస్థ శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఆరోరోజు శనివారం పద్మావతి వెంకటేశ్వర స్వామి వార్లకు సహస్రనామార్చన, సహస్రదీపోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ముదునూరు సత్యనారాయణ రాజు, వంశపారంపర్య ధర్మకర్త మంతెన రామ్‌కుమార్ రాజు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



శ్రీరంగనాథరాజుతో ఉమాశంకర్, నాయకులు

వీరవాసరం: మాజీమంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ను శనివారం ఆయన ఇంటి వద్ద రాష్ట్ర వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ విభాగం ప్రధాన కార్యదర్శి యరకరాజు ఉమాశంకర రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పురవృద్ధికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట తాళ్లూరి జయరాం, నాగరాజు అరవింద్ వర్మ ,యరకరాజు వంశీ వర్మ, యరకరాజు శ్రీనివాసరాజు తదితరులు ఉన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



కోలమూరులో గర్భిణులకు పోషకాహారం అందిస్తున్న అధికారులు

ఉండి: గర్భిణులు పోషహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్, వైద్యాధికారులు తెలిపారు. శనివారం కోలమూరులో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పేరిచర్ల సుభాష్‌రాజు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఇల్లంతా, ఇంట్లోని వారంతా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో యర్రా విక్రమ్, గాదిరాజు వెంకటేశ్వరరాజు, కొమ్మన సత్యనారాయణ, మడిచర్ల సూర్యప్రకాష్, గాజుల శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు పునాది వేయాలి

పాలకోడేరు: పాఠాలు బోధించే ఉపాధ్యాయులు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాది వేయాలని సీబీఐ అడిషనల్ ఎస్పీ పి.పెద్దిరాజు అన్నారు. శనివారం మండలంలోని శృంగవృక్షం గ్రామపంచాయతీ పరిధిలోని బంటుమిల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన పంపన సాయిబాబును ఘనంగా సత్కరించారు. అనంతరం సాయిబాబును గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు, అభినందించారు.

సూపర్ జీఎస్టీ కార్యక్రమానికి అధికారుల నియామకం

పాలకోడేరు: మండలంలో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కార్యక్రమాలకు గ్రామాల వారిగా అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ వి. రెడ్డియ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నియమించిన అధికారులు ఈ నెల 29 నుంచి అక్టోబర్ 19 వరకు ఆయా గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలందరికి జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే లాభాలను విస్తృతంగా ప్రచారం చేస్తారని పేర్కొన్నారు.

ఊరూవాడా దసరా సందడి

- అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న భక్తులు



లలితాత్రిపురసుందరి దేవి అలంకరణలో మావుళ్లమ్మ




శ్రీకాత్యాయని దేవి అలంకరణలో పార్వతి దేవి



లలితా పరమేశ్వరి అలంకరణలో పెద్దింటి అమ్మవారు



ఆకట్టుకున్న కాత్యాయనీ దేవి అలంకరణ



కాళ్లకూరులో ధనలక్ష్మీ దేవి అలంకరణ

భీమవరం(ప్రకాశం చౌక్): ఊరూవాడా దసరా సందడి నెలకొంది. శ్రీమావుళ్లమ్మ వారి ఆలయంలో శ్రీదేవీశరన్నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం అమ్మవారు శ్రీలలితాత్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శిమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్ పరివేక్షణలో దేవస్థానం ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు చిన్ని సప్తప్రాకార సేవ నిర్వహించారు. ఏడు కావళ్లతో చీర, సారెగా పలు రకాల స్వీట్స్, పండ్లు, పసుపు, కుంకుమను అమ్మవారికి సమర్పించారు. అలాగే పంచారామక్షేత్రం ఉమాసోమేశ్వర జనార్ధన స్వామి వారి దేవస్థానంలోని శ్రీ పార్వతీదేవి అమ్మవారిని శనివారం శ్రీకాత్యాయని దేవిగా అలంకరించారు. ఈఓ డి.కృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీభీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఉన్న అమ్మవారిని శనివారం ధనలక్ష్మి దేవిగా అలంకరించి పూజలు చేశారు. ఈఓ తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆకివీడు పెద్దింటి అమ్మవారిని లలితా పరమేశ్వరి అలంకరణలో భక్తులు పూజించారు. ఆరో రోజు అమ్మవారికి అంగరంగ వైభవంగా కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

కాళ్లలో..

కాళ్ల: దుర్గాదేవి అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆలయ శాశ్వత ధర్మకర్త, కాళ్ళ సొసైటీ అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు అన్నారు. మండలంలోని కోమటిగుంట గ్రామంలో కాలువగట్టు వద్ద ఉన్న శ్రీ దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆరో అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు. సుమారు 108 మంది మహిళ భక్తులతో కుంకుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే కాళ్లకూరు గ్రామంలో ఉన్న స్వయంభూః శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శనివారం ధనలక్ష్మి అమ్మవారిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అల్లూరి పద్మరాజు పద్మ, సంకా హరిచంద్ర ప్రసాద్ రామసీత దంపతులతో అమ్మవారికి కుంకుమపూజలు, అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. ఈ ఎం.అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉండిలో..

ఉండి: దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు కాత్యాయనీ దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సాయంత్రం వేళల్లో భక్తులు పెద్ద ఎత్తున ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మంటపాలతో పాటుగా ఉండి,చెరుకువాడ, మహాదేవపట్నం, యండగండి, కోలమూరు తదితర గ్రామాల్లో అమ్మవారి ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కుంకుమార్చనలు, సహస్ర అష్టోత్తర సహస్రనామాలతో సామూహిక కుంకుమ పూజలు చేశారు.



భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మను దర్శించుంటున్న భక్తులు



కాళ్ల: కోమటిగుంటలో పూజలు చేస్తున్న భక్తులు



కాళ్ల: కుంకుమ పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలి



తోకతిప్పలో మాట్లాడుతున్న జేఎన్‌వీ గోపాలన్

భీమవరం అర్బన్: ఫిల్టర్ బెడ్ బాగుచేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని కుళాయిల ద్వారా సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. మండలంలోని తోకతిప్పలో ఆ పార్టీ నాయకులు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ ఫిల్టర్ బెడ్‌లు బాగు చేయకుండా రక్షిత చెరువులోంచి నేరుగా సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారన్నారు. అంతేకాకుండా ఓవర్ హెడ్ ట్యాంకు పైన ధ్వంసమై పెచ్చులూడి పడిపోతుందన్నారు. గ్రామస్తులందరూ 20 లీటర్ల మినరల్ వాటర్‌ను రూ. 35 కొనుగోలు చేసి తాగుతున్నారన్నారు. కనీసం మౌలిక సదుపాయాలైన తాగునీరు అందించకపోడం చాలా బాధాకరమన్నారు. ఫిల్టర్ బెడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకు శుభ్రం చేసి ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించాలని లేకుంటే గ్రామస్తులతో నిరసనలు తెలియజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజేటి శ్రీనివాస్, రేవు రామకృష్ణ, బొడ్డు లక్ష్మీపతి, పొన్నమండ నాగేశ్వరరావు, తిరుమాని సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ ఎల్‌ఓటీ ఛాలెంజ్‌లో ప్రతిభ

భీమవరం: న్యూఢిల్లీలో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్, భారతదేశ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి అర్బన్ ఎల్‌ఓటీ ఛాలెంజ్ 2025 పోటీలో భీమవరంలోని విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు సత్తా చాటారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ విభాగాల విద్యార్థుల బృందం ఫస్ట్ రన్నరప్ బహుమతిని గెలుచుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంగం వేణు శనివారం విలేకరులకు తెలిపారు. తమ విద్యార్థులు రూ.50,000 నగదు బహుమతి ట్రోఫీని అందుకున్నారని వివరించారు. ఈ బృందానికి డాక్టర్ వీ.ఎస్.ఎన్. నరసింహ రాజు మెంటర్‌గా వ్యవహరించారు. విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీలక్ష్మి, కళాశాల యాజమాన్య సభ్యులు అభినందనలు తెలిపారు.

రైతులకు ఎలుకల నిర్మూలన మందు పంపిణీ



రైతులకు ఎలుకల మందు అందిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని దొడ్డనపూడి గ్రామంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పి.రమేష్ నాయుడు మాట్లాడుతూ ముందుగా వ్యవసాయ శాఖ ద్వారా అందించిన బ్రోమోడయోలిన్ మందును నూనెతో కలిపిన నూకలను తీసుకుని విషపు ఎరను తయారు చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా పొలాలలో ఎలుకల కన్నాలను ముందుగా గుర్తించి, వాటిని మట్టితో కప్పి ఉంచాలని వివరించారు. మరుసటి రోజు తెరుచుకున్న కన్నాలను బతికున్న ఎలుకల ఉన్న కన్నాలుగా గుర్తించి, వాటి వద్ద బ్రోమోడయోలిన్ మందు పొట్లాలను పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా బ్రోమోడయోలిన్ విషపు ఎర గల పొట్లాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరేటి వెంకట్ రత్న ప్రసాద్ ఆరేటి కృష్ణ, సొసైటీ డైరెక్టర్ కొల్లి వాసు పాల్గొన్నారు.

రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



సమావేశంలో వాదించుకుంటున్న కౌన్సిలర్లు

నరసాపురం: మరో మూడు, నాలుగు నెలల్లో మున్సిపల్ ఎన్నికలు వచ్చేస్తాయంటున్నారు... ఇప్పటికీ కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు అధికారుల తప్పులు నిలదీయకుండా, వారిలో వారే వాదులాడుకుంటున్నారు. దీంతో తప్పులు చేస్తున్న అధికారులు నవ్వుకుంటూ తప్పించుకుంటున్నారంటూ మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు వైకేఎస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయం ఉన్న నాలుగు నెలలైనా ప్రజా సమస్యలపై చర్చించాలని వైకేఎస్ సూచించారు. కంబంపాటి చెరువు వద్ద చెత్త వేడానికి అక్కడున్న ప్రైవేట్ స్థలం నుంచి వాహనాలను సదరు ప్రైవేట్ స్థలా యజమానులకు తెలియజేయకుండా తీసుకెళ్లడం ఏంటి? అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యతన నిర్వహించారు. ముందుగా 29వవార్డులో ఉన్న కంభంపాటి చెరువు వద్ద ఇటీవల చెత్తను డంప్ చేసే ప్రయత్నం చేయడం, స్థానికులు అడ్డుకోవడంపై కౌన్సిలర్ అడిదల శ్యామల ప్రశ్నించారు. గోదావరి గట్టున చెత్త పోయవద్దని గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశిస్తే, వాటర్ బాడీ పక్కన అదీ దళితులు ఉన్న ప్రాంతంలో చెత్తను వేయడం ఏంటి? అని మండిపడ్డారు.

చెత్త డంపింగ్‌పై తీవ్ర వాగ్వివాదం

కంభంపాటి చెరువు వద్ద చెత్తను డంప్ చేసే ప్రయత్నంపై సమావేశంలో వాడీవేడి చర్చ సాగింది. అడిదల శ్యామల, కేసరి గంగరాజు, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, కోటిపల్లి సురేష్, వంగా శ్రీకాంత్ కన్నా, జిల్లెళ్ల దిలీప్ మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ప్రస్తుతం అక్కడ చెత్తను వేయడంలేదు కదా? అయినా దీనిపై వాదనలు ఎందుకని చైర్‌పర్సన్ పదే పదే చెప్పినా సభ్యులు వినలేదు. చివరకు చైర్‌పర్సన్ సమావేశాన్ని వాయిదా వేస్తానని పలు బెదిరించినా తీరుమారలేదు. దీంతో సమావేశం రసాభాసగా మారింది. అక్కడున్న తమ సొంత స్థలాల నుంచి చెత్త ట్రాక్టర్లు తమకు కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా ఎలా తిప్పుతారని వైఎస్సార్‌సీపీ సభ్యురాలు షేక్ యాకూబీబీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇప్పుడెందుకీ సమావేశం?

అజెండాలో అభివృద్ధి పనులు ఏమీ పెట్టడంలేదని గత నెలలో సమావేశాన్ని వాయిదా వేసిన మీరు, ఇప్పుడు ఈ నెలలో కూడా అభివృద్ధి పని ఒక్కటి కూడా పెటకుండా సమావేశం ఎలా పెట్టారు? వన్నెంరెడ్డి శ్రీనివాస్ చైర్‌పర్సన్‌ను ప్రశ్నించారు. ఇది కౌన్సిల్ సమావేశంలా లేదని సంత మార్కెట్‌గా ఉందని, మీకు సమావేశం నడపడం రావడం లేదని, సభను కంట్రోల్‌లో పెట్టలేకపోతున్నారని శ్రీనివాస్ ఘాటు విమర్శలు చేయడంతో చైర్‌పర్సన్ అభ్యంతరం చెప్పారు. దీంతో ఇద్దరి మధ్య కొద్దిసేపు వాదనలు జరిగాయి. అజెండాలో చేర్చిన ట్రాక్టర్ల రిపేరు అంశంపై వాడీవేడిగా చర్చ సాగింది. రూ.6 లక్షలు పెడితే కొత్త ట్రాక్టర్ వచ్చే క్రమంలో ఒక్కో ట్రాక్టర్ రిపేరుకు రూ.4.50 లక్షలు చొప్పున ఏకంగా ఒకేసారి 13 ట్రాక్టర్ల మరమ్మతులు చేయాలని నిర్ణయించడం దారుణమని కౌన్సిలర్ రావలి రామసీత ప్రశ్నించారు. ఇది అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి చేస్తున్న కుంభకోణమని వైఎస్సార్ సీపీ సభ్యులు మొత్తం ప్రశ్నించారు. దీంతో ఈ అంశాన్ని వాయిదా వేశారు.

అసత్య ఆరోపణలతో అబద్ధపు ప్రసారాలు



తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన పెన్నాడ అగ్రహారం కుల పెద్దలు, గ్రామస్తులు

పాలకోడేరు: మండలంలోని పెన్నాడ అగ్రహారంలో తామర చెరువు గట్టుపై దాదాపు 50 కుటుంబాలకు పైగా నివసిస్తున్నాయి. కుల పెద్దలపై కొంతమంది కొన్ని న్యూస్ ఛానల్స్ వారికి 15 కుటుంబాలను వెలివేశారంటూ చెప్పారని గ్రామస్తులు మండిపడ్డారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దాదాపు 200 మంది గ్రామస్తుల మధ్య తహసీల్దార్ , పోలీసు అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు పెద్దలను అక్కడ జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఓ వార్డు మెంబర్ డ్రెయినేజీ నిమిత్తం దాదాపు రూ.3 లక్షల రూపాయలకు లెక్కలు అడిగినందుకు ఇలా చేశారని అధికారులకు తెలిపారు. గ్రామపెద్దలను అసభ్యకరంగా మాట్లాడుతున్నారని ఇలాగే జరిగితే ఎవరిని సహించమని గ్రామస్తులు హెచ్చరించారు.

ఉత్సాహంగా దసరా విజయీభవ యాత్ర

భీమవరం(ప్రకాశం చౌక్): మన సంస్కృతి సంప్రదాయాలు, ఆచార, వ్యవహారాలు, కట్టుబాట్లు చెరగని ముద్రలని, పండుగలు వాటిల్లో ఒక భాగమని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి మందిర అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు అన్నారు. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శనివారం దసరా విజయీభవ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. దసరా పండగ విజయానికి నాంది అని, ప్రాచీన సంప్రదాయాలు కనుమరుగువుతున్న ఈ తరుణంలో ఇలా పండుగ విశిష్టతను తెలియజేస్తూ అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతి దేవాలయంలోనూ ఈ దసరా శోభాయాత్ర నిర్వహిస్తున్నామని, దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది తదితర పండుగ విశిష్టత తెలియజేస్తున్నామన్నారు. అనంతరం విల్లంబులు పట్టుకుని దసరా శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు యర్రంశెట్టి అప్పారావు, కుక్కల బాల, వై.శ్యామల దేవి, కె.సుబ్బలక్ష్మి, కృష్ణ కుమారి, ఎస్.మూర్తి, కడలి ఫణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల సమస్యలను పరిష్కరించాలి



భీమవరంలో ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థినులు

భీమవరం: రాష్ట్రంలో విద్యార్థులు అన్ని రంగాల్లో ముందున్నా కానీ ప్రభుత్వం విద్యార్థులకు సరైన విద్య అందించడం లేదని ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా సహాయ కార్యదర్శి ఐష గోష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గార్ల్స్ కన్వెన్షన్ సందర్భంగా భీమవరం టౌన్‌లో పాత బస్టాండ్ నుంచి అంబేడ్కర్ భవనం వరకు 300 మంది విద్యార్థినులతో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ హాస్టల్స్ ని నిర్మించాలని అన్ని పాఠశాలల్లో కళాశాలలో శానిటరీ ప్యాడ్స్‌ని ప్రభుత్వం అందించాలన్నారు.పె రిగిన ధరలకు అనుకూలంగా మెస్ చార్జెస్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్, రాష్ట్ర గార్ల్స్ కన్వీనర్ సీహెచ్ పావని, కో కన్వీనర్స్ జ్యోతి, చిన్ని, నవిత, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా మార్కెట్ యార్డు స్థలం

- సర్పాలకు, విష పురుగులకు నిలయంగా మారిన వైనం
- ఆక్రమణలతో మరింత ప్రమాదం



మార్కెట్ యార్డు గోడౌన్ ప్రాంతంలో పడిపోయిన తూర్పు గోడలో కొంత భాగం

పాలకొల్లు సెంట్రల్: పట్టణ నడిబొడ్డులో ఉన్న మార్కెటింగ్ యార్డు స్థలం అధ్వానంగా ఉండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, మారుతి సెంటర్‌కు మధ్యలో అగ్రికల్చరల్ మార్కెటింగ్ యార్డు ఉంది. ఈ మార్కెటింగ్ యార్డుకు సంబంధించిన రోడ్డుకు ఓ పక్క కార్యాలయం, మరో పక్క గోడౌన్స్ ఉన్నాయి. గోడౌన్స్ ఉన్న ప్రాంతానికి సంబంధించి తూర్పు భాగంలో ప్రహరీ ఉంది. మునిసిపల్ రోడ్డుకు, యార్డు ప్రహరీకు మధ్యలో సుమారు 50 అడుగుల వెడల్పులో సుమారు ఓ 300 మీటర్ల పొడవున ఖాళీ స్థలం ఉంటుంది. అలాగే దక్షిణం భాగంలో బొర్రా వారి తోట కాలనీ సమీపంలో ఓ 200 మీటర్లు ఖాళీ జాగా ఉండడంతో ఆ కాలనీ వాసులు ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసి ఫెన్సింగ్ వేసి మొక్కలు పెంచుతున్నారు. కానీ తూర్పు భాగంలో ఉన్న ఖాళీ స్థలం మాత్రం అత్యంత అధ్వాన్నంగా ఉందని స్థానికులు వాపోతున్నారు.

కూలిన ప్రహరీ

గోడౌన్ సముదాయానికి సంబంధించిన తూర్పు ప్రహరీగోడలో కొంత భాగం ఓ నాలుగేళ్ల క్రితం భారీ వర్షాలకు పడిపోయింది. దీనివల్ల యార్డులోకి వెళ్లడానికి మార్గం ఏర్పడడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఈ ప్రహరీ నిర్మించడం లేదని, అలాగే ఖాళీ స్థలాన్ని బాగు చేయించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ స్థలం చెత్త చెదారం, కర్రలు, పని చేయని డెకరేషన్ మెటీరియల్స్‌తో అత్యంత అధ్వానంగా ఉంది. వర్షం వస్తే దోమలు, విష పురుగులు, దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వర్షం వస్తే అవస్థలే



మార్కెట్ యార్డు స్థలంలో వర్షం వస్తే నీరు నిల్వ ఉండిపోతుంది. దాని వల్ల దుర్వాశన ఎక్కువగా వస్తుంది. స్థానికులు వేసవిలో చల్లని గాలి కోసం ఇక్కడ కూర్చోవడానికి ఓ చెట్టు చుట్టూ దిమ్మ కట్టించారు. ఆ ప్రాంతంలో కర్రలు పడేయడంతో కూర్చునే వెసులుబాటు లేకుండా పోయింది. ఇంటిలో నుంచి దిగితే రోడ్డు వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఎదురుగా ఖాళీ స్థలంలో పిల్లలు ఆడుకుంటారంటే పాముల భయం వెంటాడుతుంది.

– కాకుల తాతాజీ, స్థానికుడు

దోమలు, పాములతో ఇబ్బందులు



ఇంటి ఎదురుగా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దోమలు పాములు ఎక్కువగా సంచరిస్తున్నాయి. మా ఇంట్లో వివాహ వేడుక ఉండడంతో కొంత స్థలాన్ని శుభ్రం చేయించుకున్నాం. అక్కడ పెళ్లి వేడుక జరుపుకుంటున్నాం. ఈ ప్రాంతంలో ఉన్న స్థానికులు చిన్న చిన్న వేడుకలు చేసుకోవడానికి ఈ స్థలం బాగా ఉపయోగపడుతుంది. దీనిని ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల మొక్కలు పెరిగిపోయి విష సర్పాలతో భయంకరంగా ఉంటుంది.

– బొర్రా చినబాబు, స్థానికుడు

3న వంతెనలకు అప్రోచ్‌ల కోసం ధర్నా

భీమవరం అర్బన్: అక్టోబర్ 3న సీపీఎం ఆధ్వర్యంలో యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేయాలంటూ తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడే ఇంజేటి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 29 నుంచి ధర్నాను విజయవంతం చేయాలని ప్రచారం చేస్తామని పేర్కొన్నారు.

చోరీ ముఠాపై అప్రమత్తంగా ఉండాలి

ఆకివీడు: మండలంలో చోరీ ముఠా సంచరించే ప్రమాదం ఉందని ఆకివీడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.జగదీశ్వరరావు చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజస్థాన్, మధ్యప్రదేశ్‌కు చెందిన ఆరుగురు వ్యక్తుల ముఠా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. తక్కువ ఛార్జీలు ఉన్న లాడ్జిల్లో వీరు దిగి ఆయా ప్రాంతాల్లో రాత్రిపూట దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. ఇటీవల తణుకు ప్రాంతంలో దొంగతనానికి పాల్పడ్డారన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కన్పిస్తే వెంటనే 112కి ఫోన్ చేయాలన్నారు. ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు బ్యాంకు లాకర్లలో దాచుకోవాలన్నారు. అపరిచితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

మహిళపై దాడి

భీమవరం: మహిళపై దాడి చేసి గాయపరిచిన సంఘటన భీమమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేమూరి నాగమణి ఆమె భర్త వెంకటేశ్వరరావు భీమవరం ప్రభుత్వాసుపత్రి సమీపంలో నివసిస్తున్నారన్నారు. నాగమణి పోలీయో వ్యాధితో బాధపడుతుందని, ఆమె భర్త వంట పనికి వెళుతుంటాడు. ఈ నేపథ్యంలో 26వ తేది రాత్రి ఒక వ్యక్తి ఇంటి తలుపు తట్టి వంట చేయడానికి పిలుస్తున్నారని వెంకటేశ్వరరావును బయటకు పిలిచారు. ఆయన బయటకు వెళ్లగానే అజ్ఞాత వ్యక్తి లోపలికి ప్రవేశించి నాగమణి చేతుల, మెడపై గాయపరిచాడు. ఆమె కేకలు వేయడంతో ఆ వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. భర్త వెంకటేశ్వరరావు నాగమణిని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ ఏఎస్సై టి.దేవరాజు తెలిపారు.

మహిళ మృతదేహం బంధువులకు అప్పగింత

వీరవాసరం: వీరవాసరం నారాయణదిబ్బ ప్రాంతంలో ఒంటరిగా ఉంటున్న శీలం సత్యవతి(60) అనారోగ్యంతో మృతి చెందడంతో శనివారం గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారుల సమక్షంలో బంధువులకు మతదేహాన్ని అప్పగించారు. శీలం సత్యవతి అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం మృతి చెందడంతో స్థానికులు గుర్తించి అధికారులకు తెలియజేశారు. గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది సంఘటన ప్రాంతానికి వచ్చి మృతదేహాన్ని ఫ్రీజర్ లో ఉంచారు. శీలం సత్యవతి వివరాలను సేకరించి చింతపరు గ్రామానికి చెందిన మహిళగా గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. శనివారం బంధువులు ఆమె మృతదేహాన్ని చింతపర్రు తీసుకుని వెళ్లారు.

వెంకయ్యనాయుడికి చినిమిల్లి పరామర్శ



వెంకయ్యనాయుడిని పరామర్శిస్తున్న చినిమిల్లి

భీమవరం అర్బన్: వైఎస్సార్ సీపీ నాయకుడు ఆరేటి వెంకయ్య నాయుడును తుందుర్రులో ఆయన నివాసంలో శనివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చినిమిల్లి వెంకట రాయుడు పరామర్శించారు. వెంకయ్యనాయుడు భార్య లక్ష్మీ (65) ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వెంకటరాయుడు వెంకయ్యనాయుడిని పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ ఆరేటి సత్య వెంకట వీరాస్వామి నాయుడు, ఆరేటి కాశీ విశ్వేశ్వరరావు, ఆరేటి అబ్బులు తదితరులు ఉన్నారు.